

నేటి నుంచి పదో తరగతి పరీక్షలు



- జిల్లావ్యాప్తంగా 77 పరీక్షా కేంద్రాలు
- ఐదు నిమిషాల గ్రేస్ టైం
- పకడ్బందీగా ఏర్పాట్లు

కరీంనగర్ టౌన్, మార్చి 17: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు జిల్లా విద్యాశాఖ పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. సోమవారం నుంచి ప్రారంభమయ్యే పరీక్షలు ఈనెల 30న ముగియనున్నాయి. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న 12,650 మంది విద్యార్థులు 'పది' పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో 6,655 మంది బాలురు, 5,874 మంది బాలికలు ఉండగా, 121 మంది ప్రైవేట్‌గా పరీక్షలు రాస్తున్నారు. వీరికోసం జిల్లావ్యాప్తంగా 77 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో కేంద్రానికి ఒకరు చొప్పున 77 మందిని చీఫ్ సూపరింటెండెంట్‌గా, 77 మందిని డిపార్టుమెంట్ అధికారులను, 154 మందిని ఇద్దరుచొప్పున అదనపు డిపార్టుమెంట్ అధికారులను నియమించి వారి పర్యవేక్షణలో జరిగే పరీక్షలకు 800 మంది ఇన్విజిలేటర్లను నియమించారు.

● అరగంట ముందే పరీక్షా కేంద్రంలోకి అనుమతి

ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగే ఈ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులను అరగంట ముందు నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. ఈసారి పరీక్షా సమయానికి ఐదు నిమిషాల గ్రేస్‌టైమ్ ఇచ్చిన ప్రభుత్వం 9.35 నిమిషాల వరకు పరీక్షా కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులను కూడా పరీక్షకు అనుమతిస్తారు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కాస్తా ఉపశమనం పొందారు. పరీక్షా కేంద్రాలకు సమయానికి అరగంట ముందే చేరుకుని ప్రశాంతంగా పరీక్షలు రాయాలని అధికారులు సూచిస్తున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలులో ఉంటుంది. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు ప్రశాంతంగా రాసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. డ్యుయల్ డెస్క్, తాగునీరు, గాలి వెలుతురు ఉండేలా ఏర్పాట్లు చేశారు. ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో ప్రతి పరీక్షా కేంద్రం వద్ద వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నారు. మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, అదనపు డిపార్టుమెంటల్ అధికారుల పర్యవేక్షణతోపాటు ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. కలెక్టర్ అధ్యక్షతన పదో తరగతి పరీక్షల నిర్వహణపై మూడుసార్లు సమావేశాన్ని నిర్వహించి విద్యా, రెవెన్యూ, పోలీసు, వైద్యశాఖ అధికారులకు మార్గదర్శనం చేయడంతో ఆయాశాఖలు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తిచేశాయి. జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్ నుంచి విద్యార్థులు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించారు. విద్యార్థి పుట్టిన తేదీ, ఆధార్‌కార్డు నంబర్ నమోదు చేస్తే హాల్ టికెట్ వస్తుందని, ఇందుకు సంబంధించి డీఈవో కార్యాల యంలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశామని, విద్యార్థులు ఏమైనా సమస్యలుంటే డెస్క్‌ను సంప్రదించాలని జిల్లా విద్యా శాఖ అధికారి సీహెచ్ వీఎస్ జనార్దన్ రావు తెలిపారు.

ఈ యేడు వంద శాతం ఫలితాలను సాధించే విధంగా పక్కా ప్రణాళికతో విద్యాబోధన చేశామన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు, వస్తువులను అనుమతించబోమని తెలిపారు. హాల్‌టికెట్, ప్యాడ్, పెన్, పెన్సిల్, స్కేల్, షార్ప్‌నర్, ఎరేజర్, జామెట్రీ పరికరాలను మాత్రమే తీసుకెళ్లవచ్చని చెప్పారు. పరీక్షల్లో కాపీయింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



పదో తరగతి పరీక్షా కేంద్రంలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది, ఉపాధ్యాయులు





చొప్పదండిలో బోనాలతో మహిళలు

ఘనంగా పోచమ్మ బోనాలు

చొప్పదండి 17: చొప్పదండి పట్టణంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ పట్నాలలో భాగంగా ఆదివారం పోచమ్మ తల్లికి బోనాలను సమర్పించారు.. మహిళలు బోనం ఎత్తుకొని డప్పుల చప్పుళ్ల మధ్య పోచమ్మ తల్లి గుడికి చేరుకొని బోనాన్ని నైవేద్యంగా సమర్పించి, మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు పెరమండ్ల గంగయ్య గౌడ్, ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు, గౌడ కులస్తులు పాల్గొన్నారు.





కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి



నేరెళ్ళ శారద

జిల్లాకు రెండు కార్పొరేషన్ పదవులు

- మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద
- కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డికి సుడా చైర్మన్

కరీంనగర్ అర్బన్, మార్చి 17: జిల్లాకు రెండు కార్పొరేషన్ చైర్మన్ పదవులు దక్కాయి. చాలా కాలంగా కాంగ్రెస్‌పార్టీలో వివిధ హోదాల్లో పనిచేస్తూ పార్టీ పటిష్ఠానికి కృషి చేస్తున్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు, మహిళా కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు నేరెళ్ల శారదకు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పదవిని కట్టబెట్టారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డిని శాతవాహన అర్బన్‌డెవ లప్‌మెంట్ అథారిటీ(సుడా) చైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. చాలా కాలంగా పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తూ, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ పటిష్ఠానికి కృషి చేసిన నాయకులకు పదవులను ఇచ్చి సముచిత ప్రాధాన్యం కల్పించింది.

● మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నియమితులైన నేరెళ్ల శారద 2001లో రామడుగు జడ్పీటీసీగా, టీపీసీసీ మహిళా విభాగం అధ్యక్షురాలుగా, జిల్లా అధ్యక్షురాలుగా, కరీంనగర్ జిల్లా స్త్రీశిశు సంక్షేమ శాఖ రీజినల్ చైర్‌పర్సన్‌గా గతంలో పనిచేశారు. కాంగ్రెస్‌పార్టీ అధినేత్రి సోనియాగాంధీ వద్ద నేరెళ్ల శారదకు మంచి గుర్తింపు ఉంది. కొంత కాలంగా నేరెళ్ల శారద హైదరాబాద్‌లోనే ఉంటూ కాంగ్రెస్‌పార్టీలో వివిధ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు.

● సుడా చైర్మన్‌గా నియమితులైప కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి 1992లో ఎన్‌ఎస్‌యూఐ నుంచి తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. ఎన్‌ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాల్లో పనిచేశారు. 2012లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ డైరెక్టర్‌గా, అదే సంస్థకు చైర్మన్‌గా పనిచేశారు. టీపీసీసీ అధికార ప్రతినిధిగా పనిచేశారు. 2014 నుంచి ఇప్పటి వరకు కాంగ్రెస్‌పార్టీ కష్టకాలం ఉన్న సమయంలో కరీంనగర్‌లో పార్టీని అంటిపెట్టుకుని పార్టీ కార్యక్రమాల్లో చురకుగా పాల్గొన్నారు. చాలా మంది కాంగ్రెస్‌పార్టీ నాయకులు పార్టీని వీడినప్పటికి కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి పార్టీలోనే ఉంటూ ఎప్పటికప్పుడు పార్టీ కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ ప్రజల్లో ఉన్నారు. కరీంనగర్‌లో కాంగ్రెస్‌పార్టీ నాయకులు వివిధ పార్టీల్లో చేరడంతో ఒంటరిగా క్యాడర్‌ను కూడగట్టి ముందుకు నడిపించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కరీంనగర్ ఎమ్మెల్యేగా కాంగ్రెస్‌పార్టీ నుంచి టికెట్ కోసం చివరి వరకు తీవ్ర ప్రయత్నం చేశాడు. టికెట్ లభించనప్పటికీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత కార్పొరేషన్ పదవి ఇస్తామని అధిష్ఠానం హామీ ఇచ్చింది. ఆ హామీని నిలబెట్టుకుంటూ నరేందర్‌రెడ్డిని సుడా చైర్మన్‌గా నియమించింది.



ప్రమాదం అంచున ప్రయాణం..

హుజూరాబాద్‌రూరల్, మార్చి 17: మండలంలోని తుమ్మనపల్లి శివారులో శనివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి చెట్ల కొమ్మలు విరిగి కరీంనగర్-వరంగల్ రహదారిపై పడ్డాయి. ఆ కొమ్మలను తొలగించక పోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాత్రి వేళలో రోడ్డుపై ఉన్న చెట్ల కొమ్మలు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

పల్లెల్లో జాజిరి సందడి



జమ్మికుంటలో జాజిరి ఆడుతున్న చిన్నారులు

జమ్మికుంట రూరల్, మార్చి 17: గ్రామాల్లో పిల్లలంతా సంతోషంగా ఆడుకునే జాజిరి ఆటలు ప్రారంభమయ్యాయి. హోలీ పండుగకు ముందు పది రోజుల పాటు గ్రామాల్లో జాజిరి ఆట ఆడుకుంటారు. పిల్లలంతా కోలలను లయబద్ధంగా కొట్టుకొంటూ జాజిరి పాటలు పాడుతూ ఉత్సాహం కనబరుస్తున్నారు. సాయంత్రం నుంచి పొద్దుపోయే వరకు అన్ని ఇళ్ల తిరుగుతూ వారు ఇచ్చే ధాన్యం, డబ్బులు తీసుకుంటారు. పది రోజుల పాటు ఆడిన తర్వాత అమావాస్య నాడు కోలలను ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసే కామదహనంలో వేసి దహనం చేస్తారు. ఆనంతరం పది రోజుల పాటు జాజిరి ఆడుకోగా వచ్చిన ధాన్యం, బియ్యం, డబ్బులను సమానంగా పంచుకుంటారు. బాలికలు కూడా చప్పట్లు కొడుతూ పాటలు పాడుతూ సాయంత్రం వేళ ఆడుతుండటంతో గ్రామాల్లో కోలాహలం నెలకొంది.

బీసీ కులాల కార్పొరేషన్ల ఏర్పాటు హర్షణీయం

గణేశ్‌నగర్, మార్చి 17: బీసీ కులాల కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయమని, కార్పొరేషన్లకు పాలకమండళ్లను నియమించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ ఒక ప్రకటనలో కోరారు. 11 కులాల బీసీ ఫెడరేషన్లను రద్దుచేసి వాటి స్థానంలో కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఇదే సమయంలో బీసీల్లో కార్పొరేషన్ లేని అనేక వృత్తి కులాలు ఉన్నాయని, ఆ కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన పాలక మండళ్లను నియమించలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం బీసీ, ఎంబీసీ కార్పొరేషన్లకు పాలక మండళ్లను నియమించాలని, ప్రతి కార్పొరేషన్‌కు వందకోట్ల రూపాయల బడ్జెట్‌ను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా సమగ్ర కులగణన జీవో విడుదల చేయడం హర్షణీయమన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	6:25 సోమవారం
సహర్	4:53 మంగళవారం

అకాల వర్షం.. తగ్గిన తాపం

- పిడుగుపాటుకు రెండు గేదెలు మృతి
- నేలరాలిన మామిడి

కరీంనగర్ టౌన్, మార్చి 17: జిల్లాలో అకాల వర్షం కురిసింది. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. కొద్ది రోజులుగా మండిపోతున్న ఎండలతో ఉక్కిరిబిక్కిరి అయిన జనం కాస్త ఉపశమనం పొందారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు జిల్లాలో 15.2 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా గన్నేరువరంలో 43.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. చొప్పదండిలో 1, రామడుగులో 1.8, గంగాధరలో 2.2, సైదాపూర్‌లో 5.4, హుజూరాబాద్‌లో 8, జమ్మికుంటలో 8.4, వీణవంకలో 10.4, ఇల్లందకుంట మండలంలో 12.4, మానకొండూర్‌లో 15.6, శంకరపట్నంలో 18.4, కరీంనగర్ రూరల్‌లో 15.8, తిమ్మాపూర్‌లో 22.8, చిగురుమామిడిలో 23.6, కరీంనగర్ అర్బన్‌లో 38.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆకాశం మేఘావృతమై చల్లగాలులు వీయడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. జిల్లాలోని పలు చోట్ల ఈదురుగాలులు, పిడుగులతో కూడిన వర్షానికి మామిడి కాయలు నేలరాలడంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఇప్పటికే పూత రాలి కాయలు తక్కువగా ఉండగా అవికూడా ఈ గాలీవానకు రాలిపోయాయని మామిడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీణవంక మండలం వల్బాపూర్ గ్రామంలో పిడుగుపాటుకు తాళ్లపల్లి శ్రీనివాస్‌కు చెందిన గేదె, గన్నేరువరం మండల కేంద్రంలో బుర్ర రాంచంద్రన్‌గౌడ్‌కు చెందిన మరో గేదె మృతి చెందాయి. జిల్లా కేంద్రంలో కురిసిన చిరుజల్లులకే కోట్ల రూపాయలతో నిర్మించిన తీగెలవంతెనపై వర్షపు నీరు నిలువడంపై ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. తీగలవంతెన నిర్మాణం, నిర్వహణ సరిగా లేదని, కొద్ది వర్షానికే నీరు నిలిస్తే భారీ వర్షం పడితే పరిస్థితి ఎలాఉంటుందోనని చర్చించుకుంటున్నారు.



కేబుల్ బ్రిడ్జిపై నిలిచిన వర్షపు నీరు



తెలంగాణ చౌక్ వద్ద భారీ వర్షం

పరీక్ష సరిగా రాయలేదని యువతి ఆత్మహత్య

జగిత్యాల రూరల్, మార్చి 17: మండలంలోని అంతర్గాం గ్రామానికి చెందిన నాగులపల్లి అశ్విత (20) అనే యువతి బీటెక్ రెండో సంవత్సరం సెమిస్టర్ పరీక్ష సరిగా రాయలేదని మనస్తాపానికి గురై ఆదివారం ఆత్మహత్య చేసుకుంది. జగిత్యాల రూరల్ ఎస్ఐ సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. హైద్రాబాద్‌లోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్న అశ్విత ఇటీవల రెండో సెమిస్టర్ పరీక్షలకు హాజరైంది. అనంతరం శివరాత్రి సెలవుల కోసం అంతర్గాం గ్రామానికి వచ్చింది. పరీక్షలు సరిగా రాయలేదని పలు సందర్భాల్లో కుటుంబసభ్యుల వద్ద బాధపడింది. ఈ నేపథ్యంలో ఐదు రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అశ్విత ఆదివారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

వడగళ్ల వానకు నేలరాలిన మామిడి



గంభీరావుపేటలో రాలిని మామిడి కాయలు, దారిలో విరిగి పడిన చెట్టు

గంభీరావుపేట, మార్చి 17: గంభీరావుపేట మండలంలో కురిసిన వడగళ్ల వానకు వరి పంటతో పాటు మామిడి తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈదురు గాలులతో కూడిని వడగళ్ల వర్షంతో చేతుకు వచ్చిన వరి పంటలు దెబ్బతిన్నాయి. మరో 15 రోజుల్లో వరి కోతలు మొదలయ్యే పరిస్థితిలో ఊహించని నష్టం వాటిల్లడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈదురు గాలులకు మామిడి కాయలు రాలి పోయాయి. రహదారుల వెంట చెట్లు నెలకొరిగాయి.

● వరిపంటకు నష్టం..

కోనరావుపట: కోనరావుపేట మండలం మరిమడ్లలో శనవారం రాత్రి కురిసన వడగండ్ల వానతో వరిపంట దెబ్బతిన్నాయి. వరిపంటలు పోట్టకు వచ్చిన దశలో వడగండ్ల వాన వల్ల వరిపంటలు దెబ్బతినడం వల్ల రైతులు నష్టపోయో పరిస్థితి ఎర్పడింది. సుమారు మరిమడ్లలో పది ఎకరాల వరకు వరి పంటలు దెబ్బతిన్నయి.


మరిమడ్లలో నేలవాలిన వడ్లు

చేపలు పట్టేందుకు వెళ్లి యువకుడి మృతి

కోరుట్ల రూరల్, మార్చి 17: మండలంలోని సంగెం గ్రామ శివారులోని వాగులో చేపలు పడుతుండగా యువకుడు మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామ శివారులో వాగులో యువకులు చేపల వేట చేస్తుంటారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం సమయంలో గ్రామానికి చెందిన కొందరు యువకులు చేపల వేట కోసం వెళ్లారు. చేపలను విద్యుత్ షాక్ సహాయంతో పడుతుంటారు. ఈక్రమంలో పట్టుకున్న చేపలను తేవడానికి నీటిలోకి వెళ్లిన రాయుడి(35) విద్యుదాఘాదానికి గురై మృతి చెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు రాయుడు బంధువులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో మునిగి మత్స్యకారుడు..

మెట్‌పల్లి, మార్చి, 17: పట్టణానికి చెందిన దీటి శంకర్(48) అను మత్స్యకారుడు ఆదివారం చెరువులో చేపలు పట్టుతుండగా ప్రమాదవశాత్తు వలలో చిక్కుకొని నీటిలో మునిగి మృతి చెందినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. పోలీసలు, కుటుంబ సభ్యులు తెలిపిన వివారల ప్రకారం.. పట్టణానికి చెందిన శంకర్ చేపలను పట్టుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. ఆదివారం మెట్‌పల్లి అనుబంధ గ్రామమైన రేగుంట గ్రామ శివారులోని చెరువులో చేపలు పట్టడానికి తోటి మత్స్యకారులతో కలిసి వెళ్లాడు. ఈ క్రమంలో చేపలు పట్టడానికి వేసిన వల కాలుకు చుట్టుకొని చెరువులో మునిగిపోయాడు. గమనించిన తోటి మత్స్యకారులు శంకర్‌ను బయటకు తీసేసరికి అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డుప్రమాదంలో గాయపడిన వృద్ధురాలి మృతి

మెట్‌పల్లి, మార్చి 17: మెట్‌పల్లి అనుబంధ గ్రామమైన ఆరుపేట గ్రామ బస్టాండ్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధినేని భూమక్క(60) అనే వృద్ధురాలు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ఎస్సై చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం.. ఆరపేటకు చెందిన బాధినేతి భూమక్క, కోరుట్ల మండలం మోహన్‌రావుపేట గ్రామానికి చెందిన నల్ల లక్ష్మి, శనిగారపు తుక్కవ్వ ఆరపేట బస్టాండ్ బస్సు దిగారు. ముగ్గురు మహిళలు ఇంటికి వెళ్లడానికి రోడ్డు దాటుతుండగా ఏపీ01ఎస్4455 నంబర్ గల కారులో భీమవరం మండలం రాగోజీపేటకు చెందిన సురేష్ అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో ముగ్గురు మహిళలు తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను స్థానికులు ప్రత్యేక వాహనంలో మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. చికిత్స పొందుతున్న బాధినేని భూమక్క ఆదివారం ఉదయం మృతి చెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు వేళాయే..

- ధర్మపురిలో 20 నుంచి ఏప్రిల్ 1 వరకు నిర్వహణ





విద్యుత్ దీపాల అలంకరణలో ఆలయం, క్షేత్రంలోని లక్ష్మీనృసింహ (యోగ) స్వామి వారు

ధర్మపురి, మార్చి 17: ధర్మపురిలో మార్చి 20 నుంచి ఏప్రిల్ 1 వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పవిత్ర గోదావరి నదీ తీరాన విరాజిల్లుతున్న ధర్మపురి క్షేత్రానికి పురాణ, ఇతిహాస, సాహిత్యపర ప్రాధాన్యం కలిగి ఆధ్యాత్మిక క్షేత్రంగా విలసిల్లుతోంది. పూర్వం ధర్మవర్మ అనే మహారాజు పరిపాలించుట వలన ఈ క్షేత్రానికి ధర్మపురి అనే పేరు వచ్చింది. క్షేత్రంలో ప్రధానంగా లక్ష్మీనృసింహస్వామి, రామలింగేశ్వరస్వామి ఆలయాలు, మసీదులు పక్కపక్కనే కలిగి అనాది నుంచి వైష్ణవ, శైవ, ముస్లిం మతసామరస్యానికి ప్రతీకగా నిలిచింది. ఈ క్షేత్రంలో బ్రహ్మదేవుడు, విష్ణుస్వరూపుడు అయిన నరసింహస్వామి, రామలింగేశ్వరస్వామి ఆలయాలు ఉన్నాయి. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుడు ముగ్గురు కొలువు అయిన ఈ క్షేత్రాన్ని త్రిమూర్తి క్షేత్రమని కూడా పిలుస్తారు. ఈ ఆలయ ప్రాంగణంలో యమధర్మ రాజు ఆలయం ఉంది. గోదావరి నదిలో స్నానం చేసిన అనతరం స్వామివారలను దర్శనం చేసుకోవటం ఇక్కడ ఆనవాయితీ. స్వామి వారలను దర్శించుకుం టే మానసిక, శారీరక, రుణ బాధలు తొలగి, ఆయురారోగ్య, అష్టఐశ్వర్యాలు ప్రసాదించుతారని భక్తులకు అపార నమ్మకం ఉంది. మార్చి 20 నుంచి ఏప్రిల్ 1 వరకు జరిగే లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి భక్తులు చేరుకుని స్వామివారలను దర్శనం చేసుకుంటారు.

● బ్రహ్మోత్సవాల్లో కార్యక్రమాలు..

ధర్మపురి క్షేత్రంలో మార్చి 20 నుంచి ఏప్రిల్ 1 వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఆలయ ఈవో, సహాయ కమిషనర్ సంకటాల శ్రీనివాస్ తెలిపారు. మార్చి 20న బుధవారం ఏకాదశి రోజున యజ్ఞాచార్యుల ఆహ్వానం, కళశ, విశ్వక్‌సేన, వాసుదేవ, పుణ్యాహవచనం, బ్రహ్మ కలశ స్థాపన, అంకురార్పణ, వరహాతీర్థం, పుట్ట బంగారం తేవడం, 21న సాయంత్రం ఆరు గంటలకు స్వామివారల కల్యాణం, 22న రాత్రి లక్ష్మీనరసింహ స్వామి వారల ఊరేగింపు సేవ ఉంటుంది. మార్చి 23న రాత్రి వేంకటేశ్వర స్వామి వారల ఊరేగింపు సేవ, 24న బ్రహ్మ పుష్కరిణిలో యోగ నృసింహస్వామి తెప్పె, డోలోత్సవాలు, 25న బ్రహ్మ పుష్కరిణిలో ఉగ్ర లక్ష్మీ నృసింహ స్వామి తెప్పె, డోలోత్సవాలు ఉంటాయి. 26న బ్రహ్మపుష్కరిణిలో వేంకటేశ్వరస్వామి తెప్పె, డోలోత్సవాలు, సాయంత్ర లక్ష్మీనృసింహస్వామి దక్షిణ దిగ్యాత్ర ఉంటుంది. మార్చి 27న లక్ష్మీ నృసింహ స్వామి ఉత్తర దిగ్యాత్ర, రాత్రి ఎనిమిది గంటలకు భోగ మండప ఉత్సవం, తొమ్మిది గంటలకు వేద సదస్సు ఉంటుంది. మార్చి 28న వేంకటేశ్వర స్వామి, దక్షిణ, ఉత్తర దిగ్యాత్రలు, రాత్రి ఎనిమిది గంటలకు దీపోత్సవం, 29న పూర్ణాహుతి, రథోత్సవం, చక్రతీర్థం, రాత్రి తొమ్మిది గంటలకు లక్ష్మీనృసింహ స్వామి వారల పుష్పయాగం ఉంటుంది. 30న రాత్రి ఏడు గంటలకు వేంకటేశ్వర స్వామి పుష్పయాగం, రాత్రి తొమ్మిది గంటలకు యోగ లక్ష్మీనర్సింహస్వామి ఏకాంతోత్సం, 31న రాత్రి ఏడు గంటలకు కొత్త నరసింహస్వామి పుష్పయాగం, రాత్రి తొమ్మిది గంటలకు వేంకటేశ్వరస్వామి ఏకాంతోత్సవం, ఏప్రిల్ 1న రాత్రి తొమ్మిది గంటలకు కొత్త నారసింహ స్వామి ఏకాంతోత్సవాలు ఉంటాయి.

● ఆలయ పక్షాన ఏర్పాట్లు పూర్తి
- ఆలయ ఈవో శ్రీనివాస్



స్వామివారి బ్రహ్మోత్సవాల కోసం ఆలయం పక్షాన అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాము. భక్తుల సౌకర్యార్థం ఆలయంలో క్యూలైన్లు, చలువ పందిళ్లు, మంచి నీటి సౌకర్యం ఏర్పాటు చేశాము. ఆలయాలు, గోపురాలకు సున్నం, రంగులు వేయించి విద్యుత్ దీపాలతో అలంకరించాము. గోదావరి నది, స్నానఘట్టాల వద్ద పందిళ్లు, దుస్తుల మార్పిడి కోసం తాత్కాలిక గదులు ఏర్పాటు చేయించాము.

గల్ఫ్ పంపిస్తానని ఏజెంట్ మోసం

- న్యాయం చేయాలని బాధితుల వేడుకోలు

ఎల్లారెడ్డిపేట, మార్చి 17: గల్ఫ్ ఏజెంట్ మోసం చేయడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. తమను మోసం చేసిన ఏజెంటుపై చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని ఆదివారం విలేకరులను వేడుకున్నారు. బాధితుల కథనం మేరకు.. మండలంలోని సింగారం, బండలింగంపల్లి, గొల్లపల్లి గ్రామాలకు చెందిన యువకులు రషీద్, ముఫీద్, ఆసీఫ్, ఇర్ఫాన్, సయ్యద్ ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో నాలుగు నెలల కిందట ముంబాయిలోని ఏజెంట్ అక్తర్ పరిచయమయ్యాడు. రూ 1.50 లక్షలు చెల్లించాలని పేర్కొన్నాడు. ముందుగా రూ.ఒక్కొక్కరు రూ.80 వేలు ముట్టజెప్పాలని స్పష్టం చేశాడు. దీంతో ఐదుగురు యువకులు అప్పులు చేసి రూ.4లక్షలు అప్పజెప్పారు. పాస్‌పోర్టులు, డబ్బులు తీసుకున్నాడు. రెండు నెలలు గడుస్తున్నా వీసా పంపించకపోవడంతో సెల్‌ఫోనులో సంప్రదించారు. ఏజెంటు స్పందించకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. 15 రోజుల కిందట సదరు ఏజెంటు యువకుల పాసుపోర్టులను కొరియర్ ద్వారా పంపడంతో తాము మోసపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బుల విషయంపై అడిగేందుకు సెల్‌ఫోనులో సంప్రదిస్తే స్పందన లేదని వాపోయారు. ముంబాయికి వెళ్లలేక.. ఏం చేయాలో తెలియక యువకులు ఆందోళన చెందుతున్నారు. ఏజెంట్ అక్తర్‌పై పోలీసులు చర్యలు తీసుకోవాలని, న్యాయం చేయాలని బాధిత యువకులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాద మృతుడి గుర్తింపు



నారాయణ(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, మార్చి 17: ఎల్లారెడ్డి పేట మండలం తిమ్మాపూర్ గ్రామ శివారులో ఈ నెల 16న రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందిన మతిస్థిమితం లేని వ్యక్తి ఎల్లారెడ్డి పేట వాసి మంద నారాయణ(53)గా ఆదివారం పోలీసులు, కుటుంబ సభ్యులు గుర్తించారు. వారి కథనం మేరకు.. గ్రామంలోని నారాయణ గత కొంత కాలంగా మతిస్థిమితం లేకుండా ఇంటి వద్దనే కుటుంబ సభ్యులతో కలిసి జీవిస్తుండేవాడు. ఈ నెల 16న ఇంటిలో చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు చుట్టు పక్కల గాలించారు. తిమ్మాపూర్ గ్రామ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో గుర్తు తెలియని శవం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రిలో ఉందనే సమాచారంతో అక్కడకు వెళ్లి చూడగా తమ తండ్రి నారాయణ అని గుర్తించారు. తమ తండ్రి మరణానికి కారణమైన వాహనాన్ని గుర్తించి చర్యలు తీసుకోవాలని మృతుడి కొడుకు శ్రీకాంత్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు. మృతుడికి భార్య చంద్రకళ, కూతురు స్వప్న, ఇద్దరు కొడుకు శ్రీకాంత్, ప్రశాంత్‌లు ఉన్నారు. కాగా బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ





రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు, కోడెమొక్కులు చెల్లించుకుంటున్న జడ్జి శ్రీలేఖ

వేములవాడ టౌన్, మార్చి 17 : దక్షిణకాశీ వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి క్షేత్రంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు రాజన్న ఆలయానికి తరలివచ్చారు. స్వామి వారి ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించి రాజన్నకు అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. రాజన్నను దర్శించుకున్న అనంతరం అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలేత్తకుండా ఉండేందుకు ఆలయాధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

● రాజన్న సేవలు ప్రముఖులు..

వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారిని తెలంగాణ రాష్ట్ర వికలాంగుల, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సంచాలకులు బొడ్డ శైలజ దర్శించుకున్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించగా సూపరింటెండెంట్ సిరిగిరి శ్రీరాములు రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. సిరిసిల్ల జిల్లా అసిస్టెంట్ సెషన్‌జడ్జి శ్రీలేఖ ఆలయంలో ప్రత్యేకపూజలో పాల్గొని కోడెమొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం సూపరింటెండెంట్ తిరుపతిరావు రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

భూ కబ్జా కేసులో మాజీ ఉపసర్పంచ్ అరెస్ట్

సిరిసిల్ల క్రైం, మార్చి 17: భూ కబ్జాకు పాల్పడిన కేసులో తంగళ్లపల్లి మండలకేంద్రం మాజీ ఉపసర్పంచ్ పెద్దూరు తిరుపతిని ఆదివారం అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల డిఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పద్మనగర్‌లోని వేముల కనక నారాయణ, రాజ్యలక్ష్మి, గాజుల లతకు చెందిన సర్వేనెంబర్ 247లోని భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకొని వారి భూమిని తిరిగి రిజిస్ట్రేషన్ చేయడానికి తిరుపతి భారీగా డబ్బులు డిమాండ్ చేశారని ఆయన తెలిపారు. ఈ మేరకు బాధితులు ఫిర్యాదుచేయగా తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో తిరుపతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా అనేక క్రిమినల్, అక్రమ డబ్బు వసూళ్లకు పాల్పడిన కేసుల్లో నిందితు డని తేలిందన్నారు. దీంతో తిరుపతిని అరెస్టుచేసి రిమాండ్‌కు పంపామని ఆయన తెలిపారు. భూ కబ్జాలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ డబ్బులు డిమాండ్‌చేసే వారిపై ప్రజలు ధైర్యంగా పోలీస్‌స్టేషన్‌లలో ఫిర్యాదు చేయాలని ఆయన తెలిపారు.

తంగళ్లపల్లి ఎంపీటీసీ అంతయ్య..

భూ అక్రమణ కేసులో జిల్లాలోని తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు కోడి అంతయ్యను ఆదివారం అరెస్ట్ చేశామని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. తంగళ్లపల్లి మండలంలో మహిళ పేరుతో ఉన్న భూమిని ధరణి సమయంలో తంగళ్లపల్లి ఎంపీటీసీ కోడి అంతయ్య తన పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నాడన్నారు. భూమిని ఖాళీ చేయాలని భూమిలోకి అక్రమంగా ప్రవేశించి కులం పేరుతో దూషించాడని బాధితురాలు గట్టుపల్లి భూమవ్వ తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని ఆయన తెలిపారు. ఫిర్యాదు మేరకు అంతయ్యపై బెదిరింపులు, భూ ఆక్రమణ, అట్రాసిటీ కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించామని ఆయన తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి

● ఆగి ఉన్న లారీ ఢీకొని ముగ్గురు..
● ఆటో ఢీకొని ఒకరి దుర్మరణం



వేణుగోపాల్(ఫైల్)



శ్రీకాంత్ (ఫైల్)

కోరుట్ల రూరల్, మార్చి 17: జగిత్యాల, కరీంనగర్ జిల్లాలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందారు. కోరుట్ల మండలం వెంకటాపూర్ గ్రామంలో ఆదివారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు కూలీలు మృతి చెందారు. కోరుట్ల మండలం వెంటాపూర్ గ్రామ శివారులోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు కూలీలు మృతి చెందారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఒంగోలు పట్టణానికి చెందిన బడికెల వేణుగోపాల్ (30) మల్యాల మండ ల ముత్యంపేట గ్రామానికి తన తండ్రితో 25 సంవత్సర క్రితం వచ్చి నివాసం ఉంటున్నాడు. వేణుగోపాల వృతిరిత్యా మేస్త్రీ పనిచేస్తూ తన కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో కొండగట్టు ప్రాంతంలో ఓ వ్యాపారి మెట్‌పల్లి పట్టణంలో తన కూతురు ఇల్లు నిర్మాణం పనులను వేణుగోపాల్‌కు అప్పగించాడు. నిర్మాణ పనులలో భాగంగా వేణుగోపాల్ ఆదివారం ఉదయం కొండగట్టు ప్రాంతానికి చెందిన పసులేటి శ్రీకాంత్ (23), కొమరం వెంకటేష్ (40) అనే కూలీలతో మెట్‌పల్లి పట్టణంలో ఇంటి పనులు చేసేందుకు ఒకే ద్విచక్రవాహనంపై బయల్దేరారు. ఈక్రమంలో మండలంలోని వెంకటాపూర్ గ్రామశివారులో జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఢీకొట్టారు. ఈ సంఘటనలో పసులేటి శ్రీకాంత్, కొమరం వెంకటేష్ సంఘటన స్థలంలోనే మృతి చెందగా బడికెల వేణుగోపాల్ తీవ్ర గాయాలతో పడిపోయి ఉన్నాడు. గమనించి స్థానికులు విషయాన్ని కోరుట్ల పోలీసులతో పాటు 108 సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న సిబ్బంది వేణుగోపాల్‌ను చికిత్సనిమిత్తం జగిత్యాల ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. కోరుట్ల, మెడిపల్లి ఎస్‌ఐలు కిరణ్ కుమార్, శ్యాంప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు. మృతదేహాలను కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. పసులేటి శ్రీకాంత్‌కు ఇటీవల వివాహం జరుగగా భార్య శిరిషా గర్భవతిగా ఉంది. వేణుగోపాల్‌కు భార్య జ్యోతితో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. వెంకటేష్‌కు భార్య సాయమ్మ తో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రమాదానికి గురైన వాహనాన్ని రాజస్థాన్‌కు చెందిన వాహనంగా పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. సంఘటన స్థలాన్ని కోరుట్ల సీఐ సురేష్‌బాబు పరిశీలించారు.

● ముత్యంపేటలో విషాదం..

మల్యాల: కోరుట్ల మండలం వెంకటాపూర్ వద్ద ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముత్యంపేట, కొండగట్టుకు చెందిన ముగ్గురు దుర్మరణం చెందడం స్థానికంగా విషాదం నింపింది. ఒంగోలు ప్రాంతానికి చెందిన వేణు ఇళ్ల నిర్మాణ పనులకు గాను కొన్నేళ్ల క్రితం ముత్యంపేటకు వచ్చాడు. ఇళ్ల నిర్మాణాలు చేస్తున్న అతను మెట్‌పల్లిలో జరిగే పనుల కోసం కొండగట్టుకు చెందిన శ్రీకాంత్, వెంకటేష్‌ను తీసుకెళుతుండగా జరిగిన ఈ ఘటనలో ముగ్గురూ మృతి చెందగా వేణు మృతదేహాన్ని తమ స్వగ్రామం ఒంగోలుకు తరలించారు. వేణుకు భార్య, ఐదేళ్లలోపు ఇద్దరు కొడుకులు ఉన్నారు. శ్రీకాంత్ మృతదేహానికి కుటుంబసభ్యులు కొండగట్టులో అంత్యక్రియలు నిర్వహించారు.

● కరీంనగర్ జిల్లాలో..

కరీంనగర్ క్రైం: కొత్తపల్లి మండల కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొక్కెరకుంటకు చెందిన బత్తిని లక్ష్మిరాజం(60) తీవ్రగాయాలతో ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడని కొత్తపల్లి పోలీసులు తెలిపారు.

లక్ష్మిరాజం ఉదయం పనిఉందని కొత్తపల్లికి వెళ్ళిన సమయంలో రోడ్డు పక్కన నడుస్తుండగా వెనుకవైపు నుంచి అతివేగంగా వచ్చిన ఆటో ఢీకొట్టి కొంతదూరం వరకు లాక్కెళ్లిన ఆటో బోల్తాపడిందని తెలిపారు. దీంతో లక్ష్మిరాజంతోపాటు ఆటోలో ఉన్న నలుగురు వ్యక్తులకు గాయాలుకాగా అందరిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో లక్ష్మిరాజం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన ఆటోడ్రైవర్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని కొత్తపల్లి పోలీసులు తెలిపారు.

వేర్వేరు చోట్ల పిడుగుపాటుకు మూడు గేదెల మృతి



వల్బాపూర్‌లో మృతి చెందిన గేదె

వీణవంక, మార్చి 17: మండలంలోని వల్బాపూర్ గ్రామంలో అదివారం సాయత్రం పిడుగు పడడంతో గేదే మృతి చెందింది. గ్రామంలోని తాళ్ళపల్లి శ్రీనివాస్‌కు చెందిన గేదేను ఇంటి ఆవరణలో చెట్టు కింద మేత మేస్తుండగా పిడుగు పాటుతో మృతి చెందినట్లు తెలిపారు. దాదపు యాభై వేల విలువచేసే గేదే మృతి చెందినట్లు బాధితుడు తెలిపారు.

గన్నేరువరం: మండలంలో శనివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి పిడుగుపడి మండల కేంద్రానికి చెందిన రైతు బుర్ర రామంచంద్రం పాడి గేదె మృతి చెందింది. గేదె మృతితో సుమారు రూ.60 వేల నష్టవ వాటిల్లిందని, దీంతో జీవనోపాధి కోల్పోయానని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

కాల్వ శ్రీరాంపూర్: పిడుగుపాటుతో పాడి గేదె మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పెరుగు ఐలు కొమురయ్యకు చెందిన పాడి గేదెను ఇంటి సమీపంలోని ఓ చెట్టు కట్టేశాడు. అకాల వర్షంతోపాటు చెట్టుపై పిడుగుపడి గేదె అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. గేదె విలువ రూ.40వేలు ఉంటుందని బాధితులు వాపోయాడు.

మల్లారెడ్డిపేటలో ఒకరి ఆత్మహత్య

గంభీరావుపేట, మార్చి 17: గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేటకు చెందిన కండెల దేవయ్య (46) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. కండెల దేవయ్య శనివారం తన ఇంట్లో గడ్డిమందు తాగాడు. దీంతో కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారు జామున దేవయ్య మృతి చెందాడు. సిద్దిపేటలో ఉన్న ప్లాటు రోడ్డు విస్తరణలో పోతుందనే బెంగతో దేవయ్య రోజూ బాధపడేవాడని మృతుడి భార్య మల్లవ్వ పోలీస్‌లకు ఇచ్చిన పిర్యాదులో పేర్కొంది. అయితే ప్లాటు కొనుగోలు సమయంలో చేసిన అప్పుతో పాటు పిల్లల చదువుల కోసం చేసిన అప్పులతో ఆర్థిక ఇబ్బందులు ఏర్పడ్డాయని తెలిపింది. ప్లాటు కోసం చేసిన అప్పే కట్టని పరిస్థితిలో ఆ ప్లాటే రోడ్డు విస్తరణలో పోతుందనదంతో మానసికంగా కృంగిపోయాడని వెల్లడించింది. అప్పుల ఒత్తిళ్లు, మరో వైపు ప్లాటు బెంగతో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని దేవయ్య భార్య ఫిర్యాదు చేసింది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ రాంమోహన్ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తాపడి యువకుడి మృతి



హరీష్ (ఫైల్)

ఇల్లందకుంట, మార్చి 17: మండల కేంద్రంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడి కంచం హరీష్ (28) అనే యువకుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కనగర్తి గ్రామానికి చెందిన నలుగురు ట్రాక్టర్ (మిల్లర్)పై జమ్మికుంటలో ఒకరి ఇంటికి స్లాబ్ పోసి ఆదివారం సాయంత్రం తిరిగి ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో ఇల్లందకుంట ఎస్‌బీఐ సమీపంలో రోడ్డుపై కంకర కుప్ప ఉండడంతో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కంకర కుప్ప ఎక్కడం వల్ల ఇంజన్ బోల్తా పడింది. దీంతో ఇంజన్‌పై కుర్చున్న కంచం హరీష్ ఎగిరిపడి కింద పడడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అరుణ్, సాంబయ్యకు తీవ్రగాయాలు కాగా, రాజయ్యకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. గాయాలైన వారిని జమ్మికుంట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతి చెందిన హరీష్‌కు 9నెలల క్రితమే వివాహం జరిగింది. వీరందరూ ఒకే గ్రామానికి చెందిన వారు కావడంతో కనగర్తి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

పెద్దపల్లి రూరల్ మార్చి 17: మండలంలోని కనగర్తి గ్రామానికి చెందిన పొన్నం శ్రీనివాస్‌గౌడ్ అనే గీత కార్మికుడు తాటి చెట్టు పైనుంచి పడి గాయాల పాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వృత్తిరీత్యా శనివారం సాయంత్రం కల్లు గీసేందుకు వెళ్లగా తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తున్న క్రమంలో మోకు జారి శ్రీనివాస్ కింద పడిపోయాడు. వెంటనే స్థానికులు గుర్తించి పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కుటుంబసభ్యులు, గౌడ సంఘం నేతలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

మాజీ తహసీల్దార్ ఇంట్లో సోదాలు



శ్రీనివాస్ ఇంట్లో సోదాలు చేస్తున్న పోలీసులు

కరీంనగర్ క్రైం, మార్చి 17: నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి భూమిని ఆక్రమించిన కేసులో అరెస్టు అయి జైలులో ఉన్న మాజీ తహసీల్దార్ చిల్ల శ్రీనివాస్‌ను కస్టడీకి తీసుకున్న కరీంనగర్ రూరల్ పోలీసులు హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో అతని ఇంటిలో ఆదివారం సోదాలు నిర్వహించారు. రెండురోజులు కస్టడీకి తీసుకున్న పోలీసులు మొదటి రోజు శనివారం కరీంనగర్‌లో ఇల్లు, గెస్ట్‌హౌజ్‌లో సోదాలు జరిపిన పోలీసులు పలు కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం మాదాపూర్‌కు తీసుకువెళ్లి అతని అపార్ట్‌మెంట్‌లో సోదాలు నిర్వహించామని, కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నామని కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

పెగడపల్లి, మార్చి 17: మండలం లోని బతికెపల్లి గ్రామానికి చెందిన వడ్కాపురం భాస్కర్ (35) అనే యువకుడు జీవితంపై విరక్తి చెంది ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం మృతుడు భాస్కర్ అప్పుల బాధ పెరగడంతో కుటుంబ పోషణ భారం అయింది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఇంటి పక్కనచ గల బాత్రూంలో ఉరి వేసుకొని మృతి చెందాడు. మృతుని భార్య మంజుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

సుడా చైర్మన్‌కు ఘన స్వాగతం


సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్ అర్బన్, మార్చి17: శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా) చైర్మన్‌గా నియామకమైన నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు ఆదివారం ఘనస్వాగతం పలికారు. శనివారం సుడా చైర్మన్‌గా ఎంపికైన తరువాత మొదటిసారిగా ఆదివారం ఉదయం నరేందర్‌రెడ్డి కరీంనగర్‌కు రాగా ఆయనకు రేణికుంట టోల్‌ప్లాజా వద్ద మొదలుకొని కరీంనగర్ వరకు వివిధ చోట్ల పార్టీ వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పూలబొకేలతో స్వాగతం పలుకుతూ సన్మానించారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ర్యాలీలు, ఫ్లెక్సీలకు అనుమతి లేనందున సాధారణ స్వాగత, సన్మాన కార్యక్రమాలను నిర్వహించారు.

పారమిత పాఠశాలలో వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న పారమిత విద్యార్థులు

కరీంనగర్ టౌన్, మార్చి 17: నగరంలోని పారమిత ఉన్నత పాఠశాలలో వికసిత పేరుతో రెండురోజుల పాటు నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవ వేడుకలను ఘనంగా ముగిశాయి. ఆదివారం ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా పారమిత విద్యాసంస్థల అధినేత ప్రసాద్‌రావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు నైతిక విలువలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల చిన్నారులు నిర్వహించిన శారదాంబ నృత్యప్రదర్శన, పల్లెటూరులోని కమ్మతనాన్ని వివరించే నృత్యప్రదర్శన, నాన్న గొప్పతనాన్ని వివరించే నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో పారమిత విద్యాసంస్థల డైరెక్టర్లు ప్రసూన, అనూకర్‌రావు, రశ్మిత, వినోద్‌రావు, రాకేశ్ ప్రసాద్, ప్రాచీ, వియుఎం ప్రసాద్, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చాకుంటను దత్తత తీసుకున్న ఫార్చ్యూన్ మెడికేర్ ఆసుపత్రి


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఫార్చ్యూన్ మెడికేర్ ఆసుపత్రి అధినేత రాజశేఖర్

కరీంనగర్ రూరల్, మార్చి 17: చొప్పదండి మండలంలోని చాకుంట గ్రామాన్ని వైద్యపరంగా దత్తత తీసుకున్నామని ఫార్చ్యూన్ మెడికేర్ అధినేత ముప్పిడి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం చాకుంట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫార్చ్యూన్ మెడికేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్యబృందంచే ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య రంగంలో సేవలందించేందుకు గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గ్రామస్థుల సహకారం తిరుమల్‌తో ఉపాధ్యాయ బృందం చేస్తున్న కృషికి గాను తాను కూడా విద్యత పాటు వైద్యం అందిస్తామన్నారు. ఇక మీదట వైద్య ఖర్చుల నిమిత్తం ఎక్కడికి వెళ్లకుండా మా ఆసుపత్రిలో వైద్య సేవలు పొందవచ్చని హామీ ఇచ్చారు. వైద్య శిబిరానికి సహకరించిన లయన్ సింహరాజు కోదండరాములు, శంకర్‌ప్రసాద్‌రెడ్డి, గ్రామస్థులు, ప్రధానోపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. వైద్య శిబిరంలో ఫిజిషియన్స్, గైనకాలజిస్ట్, నేత్రవైద్యులతో ఉచితంగా వైద్య సేవలు అందించడంతో పాటు, ఖరీదైన ఈకో పరీక్షలు, రక్త, బిపి, షుగర్, ఈసిజి పరీక్షలు నిర్వహించారు.

జమ్మికుంట ఇన్‌చార్జి తహసీల్దార్‌గా శ్రీనివాస్

జమ్మికుంట, మార్చి 17: జమ్మికుంట ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ప్రస్తుతం డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న నీలం శ్రీనివాస్‌కు బాధ్యతలు అప్పగించారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో జమ్మికుంట తహసీల్దార్ రజని నాలుగురోజుల క్రితం ఏసీబీ అధికారులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. హనుమకొండలోని తన నివాసంలో 12కోట్ల రూపాయల ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు, బంగారం, నగదు, వాహనాలు బయట పడగా, అందులో మూడుకోట్ల రూపాయల అక్రమ ఆస్తులు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. జమ్మికుంటలో తహసీల్దార్ నియామకం కోసం ఉన్నతాధికారులు మూడురోజుల క్రితం సీసీఎల్‌కు రిపోర్ట్ పంపించారు. శనివారం నుంచి లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఆ ప్రక్రియ ప్రస్తుతం నిలిచింది. పార్లమెంట్ ఎన్నికల నిర్వాహణలో తహసీల్దార్ కీలక బాధ్యతలు నిర్వాహించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో పూర్తిస్థాయి తహసీల్దార్‌ను ఎప్పుడు నియమిస్తారో వేచి చూడాల్సిందే.

రిటైర్డ్ ఉద్యోగులకు ఉచిత కంటి వైద్య శిబిరం


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

హుజూరాబాద్, మార్చి 17: హుజూరాబాద్ పట్టణంలోని పెన్షనర్ల భవనంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా వైద్యులు 102 మంది పెన్షనర్లకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు, కంటి అద్దాలను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ దీప్‌సింగ్, ఉదయ్ కళీల్, ఉస్మాన్ పాషా, విష్ణుదాస్ గోపాల్‌రావు, గంజి జయవర్ధన్, దుర్గాజీ, గణపతిరెడ్డి, లక్ష్మినారాయణ, శ్రీహరి, కాంతామ్మ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికావద్దు

హుజూరాబాద్, మార్చి 17: పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాయాలని తెలంగాణ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పోలంపల్లి ఆదర్శన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. సోమవారం నుంచి పదోతరగతి పరీక్షలు ప్రారంభమవుతాయని తెలిపారు. పరీక్షలు రాసే విద్యార్థులకు తల్లిదండ్రులు ఒత్తిడి పెంచవద్దన్నారు. మార్కులు బాగా రావాలని తల్లిదండ్రులు పదే పదే పిల్లలతో అనవద్దని పేర్కొన్నారు. పరీక్షల సమయంలో సమయానికి ఆహారం, నిద్రపోవాలని తెలిపారు.

పురుషుల పొదుపు సంఘం అధ్యక్షుడిగా రవీందర్‌రెడ్డి

శంకరపట్నం, మార్చి 17: శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామ పురుషుల పొదుపు సంఘం అధ్యక్షుడిగా వంగల రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం పొదుపు సంఘం 22వ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా సంఘం లావాదేవీలను గణకుడు సభ్యులకు చదివి వినిపించారు. అనంతరం నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. పాలకవర్గ సభ్యులుగా పిన్‌రెడ్డి తిరుపతిరెడ్డి, పిన్‌రెడ్డి సంపత్‌రెడ్డి, కాటం సంపత్‌రెడ్డి, గుండేటి సమ్మయ్య, చింతిరెడ్డి మధుకర్‌రెడ్డి, చింతిరెడ్డి జీవన్‌రెడ్డి, గండికోట రవి, కాటం రత్నాకర్‌రెడ్డి, రెడ్డి శ్రీనివాస్, ముత్తోజు నాగరాజ్ ఎన్నికయ్యారు. సమావేశంలో తాడికల్ పురుషుల పొదుపు సంఘం అధ్యక్షుడు నరహరి రాజిరెడ్డి, సమితి గణకుడు కాసగోని అంజయ్య, గణకుడు బూస తిరుపతి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రాముడి పేరుతో బీజేపీ రాజకీయం

-బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు


మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు

మానకొండూర్, మార్చి 17 : రాముడి పేరుతో బీజేపీ రాజకీయం చేయడమే తప్ప కరీంనగర్ అభివృద్ధికి ఎంపీ బండి సంజయ్ నిధులెన్ని తీసుకువచ్చాడో చెప్పాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు డిమాండ్ చేశారు. ప్రజాహిత యాత్ర ప్రజా వ్యతిరేక యాత్రగా ముగిసిందని ఆయన విమర్శించారు. మానకొండూర్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ నాయకులకు దమ్ము ఉంటే రాముడి బొమ్మ లేకుండా ఎన్నికలలో పోటీ చేయాలన్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 750 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టినట్లు గొప్పలు చెపుతున్న బండి సంజయ్ ప్రత్యేక నిధులు తీసుకురాలేదని ఆరోపించారు. ప్రజాహిత యాత్రలో ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు బండి సంజయ్‌కి కనిపించలేదా అని ఆయన ప్రశ్నించారు. బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటేనని హైదరాబాద్‌లో మోదీ పర్యటన సందర్భంగా బయటపడిందన్నారు. యాత్రల పేరుతో కోట్లాది రూపాయలను సంపాదిస్తున్నాడే తప్ప కరీంనగర్ అభివృద్ధికి సంజయ్ నిధులు మంజూరు చేయించలేదని జీవీ రామకృష్ణారావు విమర్శించారు. బోయినపల్లి వినోద్‌కుమార్ ఎంపీగా ఉన్న సమయంలో కరీంనగర్‌కు అనేక నిధులు తీసువచ్చారన్నారు. రాబోయే ఎన్నికలలో వినోద్‌కుమార్ గెలుపు ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ తాల్లపల్లి శేఖర్‌గౌడ్, మాజీ మండల అధ్యక్షులు శాతరాజు యాదగిరి, రామంచ గోపాల్‌రెడ్డి, పిట్టల మధు, నాయకులు ఉన్నారు.

దళితుల అభివృద్ధికి కృషి

సుభాష్‌నగర్, మార్చి17: దళితుల అభివృద్ధికి పాటు పడతానని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణ అన్నారు. ఆదివారం స్థానిక కిసాన్‌నగర్‌లో కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్, కిసాన్‌నగర్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. తాను మామూలు మధ్య తరగతి కుటుంబంలో పుట్టినప్పటికీ కష్టపడి చదివి ఓ స్థాయికి వచ్చానన్నారు. కిసాన్‌నగర్ చర్చితో తనకు ఎంతో అనుబంధం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు సాంబయ్య, దరిపెల్లి క్రాంతి, సంపతి అశోక్, కల్లెపల్లి నవీన్, మోదుంపల్లి అంజి, కీర్తిసాయి, లింగంపల్లి శ్రవన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల కమిటీలో పలువురికి చోటు

రామడుగు, మార్చి 17: బీజేపీ మండల కమిటీలో పలువురికి ఆదివారం చోటు లభించింది. మండల ప్రధాన కార్యదర్శిగా పూరెల్ల శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా కాడె నర్సింగం, కార్యదర్శిగా వి రమేశ్ నియమించినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

నిరుపేదకు ఉచిత మోకీళ్ల మార్పిడి


వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ బీఎన్‌రావు

సుభాష్‌నగర్, మార్చి 17: డాక్టర్ బీఎన్ రావు హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేదకు ఉచిత మోకీళ్ల మార్పిడి చికిత్స అందించారు. ఆదివారం నగరంలోని మహావీర్ ఆసుపత్రిలో విలేకరుల సమావేశంలో డాక్టర్ బీఎన్‌రావు వివరాలు తెలియచేశారు. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం గుంపుల గ్రామానికి చెందిన భూమయ్య(85) పదేళ్లగా మోకీళ్ళ నొప్పులతో బాధపడుతున్నాడన్నారు. కుటుంబ సభ్యులు ఆయనను డాక్టర్ బీఎన్‌రావు వద్దకు తీసుకెళ్ళగా ఆపరేషన్ చేయాలని సూచించారు. అయితే ఆపరేషన్ చేయించుకునే ఆర్థిక స్థోమతలేక నొప్పులతోనే కాలం వెల్లదీస్తున్నాడు. తెలిసిన వారి ద్వారా డాక్టర్ బీఎన్ రావును సంప్రదించి, వారి కుటుంబ పరిస్థితి గురించి ఆయనకు తెలియచేశారు. నగరంలోని మహావీర్ ఆసుపత్రిలో డాక్టర్ శివకుమార్ తన ఆసుపత్రిలో ఆపరేషన్ చేయడానికి సమ్మతించారు. డాక్టర్ బీఎన్‌రావు హెల్త్ ఫౌండేషన్ సహకారంతో సుమారు 5లక్షల రూపాయల ఖర్చుతో కూడిన ఆపరేషన్ పూర్తి ఉచితంగా చేశారు. సమావేశంలో డాక్టర్ శివకుమార్, ఫౌండేషన్ సభ్యుడు డాక్టర్ అలీం పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన కార్యవర్గం

సుభాష్‌నగర్, మార్చి 12: నగరంలోని 56 డివిజన్ పద్మశాలి సంఘం కమిటీని ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక భాగ్యనగర్ కమ్యూనిటీ హాలులో కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆరుకాల సురేష్, గౌరవ అధ్యక్షు డిగా వంగర రవీందర్, ప్రధాన కార్యదర్శిగా గ్యాజుంగి మురళి, కోశాధికారిగా అల్లె మహేం దర్, ఉపాధ్యక్షులుగా కట్ల ఆనందం, గోరిట్యాల సత్యనారాయణ, అన్నం శంకర్, బైరి రాం ప్రసాద్, అంకారపు కైలాసపతి, సలహా దారులుగా బొమ్మకంటి వెంకటేశ్వర్లు, అయిట్ల వీరేశం, కస్తూరి రామ్మోహన్, సంయుక్త కార్యదర్శులుగా భోగ భాస్కర్, గ్యాజుంగి నర్సయ్య, గుర్రం భూమేశ్, అలవాల ఆంజనేయులు, గౌడ రమేశ్, పచ్చునూరి నరేందర్, కార్యనిర్వాహక కార్యదర్శిగా కర్నాల జగన్ మోహన్, ప్రచార కార్యదర్శిగా గాలిపెల్లి జగన్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పట్టణ పద్మశాలి సంఘం ప్రధానకార్యదర్శి వంగర ఆంజనేయులు, కోశాధికారి గజవెల్లి కన కయ్య, ఉపాధ్యక్షులు తేల్ల చంద్రశేఖర్, వెల్దండి కనకయ్య, ఏలిగేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిజాం పాలనను కళ్లకు కట్టినట్లు చూపిన 'రజాకార్'

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్


మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్

కరీంనగర్ టౌన్, మార్చి 17: నిజాం పాలనలో తెలంగాణ ప్రజలు పడ్డ బాధలు, గోసను కళ్లకు కట్టినట్లు చూపిన సినిమా రజాకార్ అని, నిజాం నియంత, రజాకార్ల రాక్షసత్వ పాలనపై తెలంగాణ ప్రజలు చేసిన పోరాటాల చరిత్రను అద్భుతంగా తెరపై చూపించారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు. ఆదివారం ఆయన కరీంనగర్‌లోని మమత థియేటర్‌లో సినిమా యూనిట్‌తోపాటు కలిసి రజాకార్ చిత్రాన్ని వీక్షించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ నిజాం పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విమోచన కల్పించి మనమంతా స్వేచ్ఛావాయువులు పీల్చుకునేలా చేసింది ఉక్కు మనిషి సర్దార్ వల్లాభాయ్ పటేల్ అన్నారు. నిజాం పాలనలోని వాస్తవాలను నేటి తెలంగాణ ప్రజలకు తెలియజేయాలనే మంచి ఉద్దేశంతో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా, ఎన్ని అవరోధాలు కల్పించినా వాటిని అధిగమించి సినిమాను అత్యద్భుతంగా చిత్రీకరించి ప్రజలకు చూపిస్తున్న దర్శక, నిర్మాతలు యాట సత్యనారాయణ, గూడురు నారాయణరెడ్డిను అభినందించారు. చాకలి అయిలమ్మ చేసిన పోరాటాలను కళ్లారా చూపించారని, పరకాల, గుండ్రాంపల్లి వంటి గ్రామాల ప్రజల పోరాటస్ఫూర్తిని ఈ సినిమాలో చూపించారని తెలిపారు. కేసీఆర్ ఎక్కడున్నా రజాకార్ సినిమా చూడాలని కోరారు. మజ్లిస్ వారసులందరిని పాత బస్తీలోని చార్మినార్ వద్ద రజాకార్ సినిమాను చూపించాలని బండి సంజయ్ సూచించారు.

క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలి

- మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్



జనగాం టీంకు చెక్కు, ట్రోఫీ అందజేస్తున్న వొడితెల సతీష్‌కుమార్

సైదాపూర్, మార్చి 17: ప్రతీ క్రీడాకారుడు క్రీడల్లో బాగా ఆడి రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించాలని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ అన్నారు. సైదాపూర్ మండలంలోని వెన్కేపల్లి శివారులో నెల రోజులుగా ముత్యాల గాంధీ నిర్వహిస్తున్న ముత్యాల గాంధీ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ ఆదివారం పూర్తయింది. సైదాపూర్ మండలం శివరాంపల్లి, అక్కెన్నపేట మండలం జనగాం టీంలు ఫైనల్ మ్యాచ్‌లలో తలపడ్డాయి. అందులో జనగాం టీం విన్నర్ కాగా శివరాంపల్లి టీం రన్నర్‌గా మిగిలింది. ముత్యాల గాంధీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ విన్నర్ టీంకు రూ. 50వేల నగదు బహుమతి చెక్కు, కప్పు, రన్నర్ టీంకు రూ. 25వేల నగదు బహుమతి, కప్పు అందజేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ మాట్లాడుతూ ముత్యాల గాంధీ తన సొంత ఖర్చులతో క్రీడలు నిర్వహించి క్రీడాకారులను, యువకులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. యువత, క్రీడల్లో రాణించాలన్నారు. యువత దేశానికి పట్టుకొమ్మలని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ ఎస్ మండల అధ్యక్షుడు సోమారపు రాజయ్య, నాయకులు ముత్యాల గాంధీ, మాదం స్వామి, సుధీర్, రవి మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి చేయూత

హుజూరాబాద్‌రూరల్, మార్చి 17: మండలంలోని చెల్పూర్ గ్రామానికి చెందిన అనుమాండ్ల భాస్కర్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందగా, వారి కుటుంబానికి ఆదివారం ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రతినిధులు పాలసీ చెక్కును మృతుడి భార్య అనుమాండ్ల సునీతకు అందజేశారు. మృతుడు అనుమాండ్లభాస్కర్‌రెడ్డి ఎస్‌బిఐ లైఫ్ ఇన్సూరెన్స్‌లో స్మార్ట్ స్కాలర్ పాలసీని ఎంచుకొని రెండు టర్మ్‌ల పాలసీని కట్టారు. ఈ క్రమంలోనే అనారోగ్యంతో మృతి చెందగా పాలసి మెచ్యూరిటీ కాగా ఐదు లక్షల రూపాయల పాలసీ చెక్కును మృతుడి భార్యకు కార్యాలయం మేనేజర్ సుధాకర్ అందజేశారు. కార్యక్రమంలో ఏజెన్సీ మేనేజర్ విష్ణువర్ధన్, అడ్వైజర్ మేకం అరవింద్ తదితరులు ఉన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం నిర్వహిస్తున్న రెడ్డి సంఘం నాయకులు

తిమ్మాపూర్, మార్చి17: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు గాను తిమ్మాపూర్ మండల కేంద్రంలో తిమ్మాపూర్ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం అధ్యక్షుడు ఎడ్ల ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఓరుగంటి సంతోష్‌రెడ్డి, సలహాదారు గంకిడి లక్ష్మారెడ్డి, ఎడ్ల జోగిరెడ్డి, చిన్న జోగిరెడ్డి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం

శంకరపట్నం, మార్చి 17: సోమవారం నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో వెంకటనర్సింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శంకరపట్నం మండలంలో కేశవపట్నం, తాడికల్, మొలంగూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కేశవపట్నంలో 169, తాడికల్‌లో 92, మొలంగూర్‌లో 72 మొత్తం 333మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి పూర్తిస్థాయిలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంఈవో పేర్కొన్నారు.

గంగాధర: పదోతరగతి పరీక్షలకు ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఎంఈవో వేణు కుమార్ తెలిపారు. మండలంలో నాలుగు పరీక్ష కేంద్రాలను సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. గంగాధర ప్రభుత్వ పాఠశాల, వివేకానంద విద్యాలయం, మైనారిటీ బాలికల గురుకుల పాఠశాల, గర్షకుర్తి ప్రభుత్వ పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎనిమిది ప్రభుత్వ పాఠశాలలు, మోడల్‌స్కూల్, మైనారిటీ గురుకుల విద్యాలయం, జ్యోతిబాపూలే బాలికలు, బాలురు, కేజీబీవీతోపాటు ఆరు ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. 459 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, 234 మంది ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఈ సందర్భంగా పరీక్షలకు ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు.

గోపాల్‌రావుపేటలో చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రం ప్రారంభిస్తున్న నాయకులు

రామడుగు, మార్చి 17: మండలంలోని గోపాల్‌రావుపేటలో ఆదివారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో లక్ష్మీనర్సింహస్వామి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. వేసవిలో ప్రయాణీకుల దహర్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామని, ప్రతీఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సంఘం అధ్యక్షుడు దాసరి కనుకయ్య కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దాసరి రవిశాస్త్రీ, తడిగొండ మల్లేశం, దాసరి సంపత్, ఆరెల్లి రాజశేఖర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, మార్చి17: నగరంలో విద్యుత్ మరమ్మత్తులలో భాగంగా సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూడు గంటల వరకు నగరంలో వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ టూ ఏడీఈ సుధీర్ కుమార్ తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిపే వేయు ప్రాంతాలు, కొత్త లేబర్ అడ్డా, సెయింట్‌జాన్ స్కూల్ ఏరియా, శివ థియేటర్ ఏరియా, భాగ్య నగర్, జ్యోతినగర్, సంతోష్‌నగర్ విద్యానగర్ చైతన్యపూర్ వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

'గంగలో విషనాగులు' పుస్తక పరిచయం

కరీంనగర్ కల్చరల్, మార్చి 17: ఘన సంస్కృతీ సాంప్రదాయాలకు నిలయమైన భారతదేశ చరిత్రను ప్రతి ఒక్కరూ అధ్యయనం చేయాలని, అంతర్జాతీయంగా దేశ విచ్ఛిన్నకర శక్తులు చేస్తున్న కుట్రలకు బలి కావద్దని ఆర్‌డీఓ కుందారపు మహేశ్వర్ అన్నారు. ఆదివారం వాగీశ్వరి డిగ్రీ కళాశాలలో ప్రజ్ఞాభారతి, జాతీయ సాహిత్య పరిషత్, సమాచార భారతి సంయుక్త నిర్వహణలో రాజీవ్ మల్హోత్రా, విజయ విశ్వనాథ్ రచించిన 'ద స్నేక్స్ ఇన్ గంగ' తెలుగు అనువాదం 'గంగలో విషనాగులు' పుస్తక పరిచయ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 'ద స్నేక్స్ ఇన్ గంగ' పుస్తకాన్ని డాక్టర్ బొమ్మరాజు సారంగపాణి ప్రభావవంతంగా అనువదించారని అన్నారు. బూర్ల దక్షిణామూర్తి, వడ్డి విజయసారథి మాట్లాడారు. నవయుగ భారతి బాధ్యుడు రాంపల్లి మల్లికార్జున్ రచించిన జాతి పునర్నిర్మాణ రథసారథులు పుస్తకాన్ని ఆర్‌డీఓ ఆవిష్కరించారు. ప్రజ్ఞాభారతి చైర్మన్ డాక్టర్ ఎల్ రాజభాస్కర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల నగేశ్‌రెడ్డి, గాజుల రవీందర్, శంకరయ్య, సత్యనారాయణరెడ్డి, మురళి, విమల్‌కుమార్, గంగాధర్, శ్రీకర్, విద్యాసాగర్, రాధాకృష్ణారెడ్డి, తిరుపతిరావు, రమేశ్‌రెడ్డి, డాక్టర్ భాగ్యరెడ్డి పాల్గొన్నారు.

రజాకర్ సినిమాను వీక్షించిన బీజేపీ నాయకులు

హుజూరాబాద్, మార్చి 17: హుజూరాబాద్ పట్టణంలోని అన్నపూర్ణ థియేటర్‌లో ఆదివారం బీజేపీ నాయకులు రజాకర్ సినిమాను వీక్షించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ నిజాం, రజాకర్ల చరిత్రను సినిమాలో కళ్లకు కట్టినట్లుగా చూపించారన్నారు. చిత్రం అద్భుతంగా ఉందన్నారు. తెలంగాణలోని ప్రతిఒక్కరూ తప్పకుండా ఈ సినిమా చూడాలన్నారు. కార్యక్రమంలో మాడ వెంకట్‌రెడ్డి, మాడ గౌతమ్ రెడ్డి, గంగిశెట్టి రాజు, కట్కూరి అశోక్‌రెడ్డి, పైళ్ల వెంకట్‌రెడ్డి, నల్ల సుమన్, మాసాడి ముత్యంరావు పాల్గొన్నారు.

నేరెళ్ల శారద నియామకంపై హర్షం

రామడుగు, మార్చి 17: మహిళా కాంగ్రెస్ రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు నేరెళ్ల శారదను రాష్ట్ర ప్రభుత్వం మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నియమించడంతో మండలంలోని ఆమె స్వగ్రామమైన వెదిరలో హర్షం వ్యక్తం చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాలాగౌడ్, సంతోష్‌రెడ్డి, అంజయ్య, మారుతి, తిరుపతి, గ్రామస్థులు పాల్గొన్నారు.

కరీంనగర్‌రూరల్: మహిళా కమిషన్ చైర్మన్‌గా నేరెళ్ల శారద ఎంపిక కావడం పట్ల సర్ధార్ సర్వాయి పాపన్నగౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్‌గౌడ్ హర్షం ప్రకటించారు. తెలం గాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్‌గా కాంగ్రెస్ సీనియర్ నాయకు రాలు నేరెళ్ల శారదగౌడ్ ఎన్నిక కావడం పట్ల హర్షం ప్రకటిస్తున్నామన్నారు.

నిరుపేద కుటుంబానికి బియ్యం పంపిణీ

ఇల్లందకుంట, మార్చి 17: మండలంలోని సిరిసేడు గ్రామానికి చెందిన నేరెళ్ల శ్రీనివాస్ ఇటీవల మృతి చెందాడు. ఆయనది నిరుపేద కుటుంబం కావడంతో నిరుపేద కుటుంబానికి పాడి కౌశిక్‌రెడ్డి సేవా సమితి అధ్యక్షుడు బోగం మురళీ ఆధ్వర్యంలో 25కిలోల బియ్యాన్ని ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో గొట్టే శేఖర్, బోగం సంతోష్, ప్రమోద్ కుమార్, కుమార్, జలపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కమిషన్ సభ్యుడికి సన్మానం

కరీంనగర్ రూరల్, మార్చి 17: ఎస్సీ కమిషన్ సభ్యుడిగా నియమితులైన వడ్డేపల్లి రామచందర్‌ను బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి జాడి బాల్‌రెడ్డి ఆదివారం ఘనంగా సన్మానించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ కేంద్రపార్టీ నూతనంగా ఎస్సీ కమిషన్ సభ్యుడిగా రామచందర్‌ను నియమించడం హర్షించగదిన విషయమన్నారు. బీజేపీ పార్ల మెంట్ కార్యాలయంలో పుష్పగుచ్ఛం అందించి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల కమిటీ జిల్లా కన్వీనర్ బండరమణారెడ్డి, జిల్లా కార్యదర్శి రాపర్తి ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎడమ సత్యనారాయణరెడ్డి, ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి ఎర్రోళ్ల ప్రశాంత్, గొర్లె కిష్టయ్య వెంకట రమణ, తదితరులు పాల్గొన్నారు.

'అంజన్‌కుమార్‌కు నామినేటెడ్ పదవి ఇవ్వాలి'

కరీంనగర్ అర్బన్, మార్చి 17: బీసీ సామాజిక వర్గానికి చెందిన జిల్లా నాయకుడు, టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్‌కు నామినేటెడ్ పదవి ఇవ్వాలని యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ఇమ్రాన్ ఆదివారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వ 37 నామినేటెడ్ పదవులలో వైద్యుల అంజన్ కుమార్‌కు అవకాశం దక్కక పోవడం చాలా బాధాకరమని అన్నారు. 33 సంవత్సరాల నుంచి ఎన్ఎస్‌యుఐ, వివిధ విభాగాలతోపాటు నేటి టీపీసీసీ కార్యదర్శి వరకు కాంగ్రెస్ పార్టీకి కోసం చాలా కష్టపడ్డారన్నారు. రెండు పర్యాయాలు మున్సిపల్ కార్పొరేటర్‌గా కూడా పనిచేశారన్నారు. 1991 నుంచి 2023 వరకు జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కొరకు క్రమశిక్షణ కార్యకర్తగా పని చేశారన్నారు. సీఎం, ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిల్ల శ్రీధర్ బాబులు అంజన్ కుమార్‌కు న్యాయం చేయాలన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

జమ్మికుంట రూరల్, మార్చి 17: మండలంలోని పెద్దంపల్లిలో జరిగిన ఓ వివాహ వేడుకలో డీజే బాక్సులు పెట్టి ఇబ్బందులకు గురి చేసిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు. శనిగరపు శ్రీకాంత్, అంబాల వినయ్ డీజే బాక్సులు పెట్టి పెద్ద శబ్ధాలు చేస్తుండటంతో పోలీస్‌లకు సమాచారం అందించారు. డీజే బాక్సులు, ఆటో ట్రాలీని పోలీస్‌లు స్వాధీనం చేసుకొని, నిర్వాహకులు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పోలీస్‌లు తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

జమ్మికుంట రూరల్, మార్చి 17: జమ్మికుంట మండలం తనుగులలో కాసర్ల సునీల్ అనే వ్యక్తి బెల్ట్ షాపు నడుపుతున్నాడని అందిన సమాచారం మేరకు పోలీస్‌లు ఆదివారం రాత్రి దాడులు నిర్వహించారు. బెల్ట్‌షాపులో అక్రమంగా నిల్వ ఉన్న ఐదువేల రూపాయల విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని, సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వరంగంటి రవి తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

జమ్మికుంట, మార్చి 17: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని మోత్కులగూడెంకు చెందిన బొల్లం శంకర్ అనే వ్యక్తి వద్ద రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేసి ఉన్నాయని అందిన సమాచారం మేరకు ఆదివారం రాత్రి పోలీస్‌లు దాడులు నిర్వహించారు. 7.5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని శంకర్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.